జనార్ధన్‌రెడ్డికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

జనార్ధన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

అర్వపల్లి, మార్చి 27: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో సూర్య దేవాలయం నిర్మించిన కాకులారపు జనార్ధన్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో జనార్ధన్‌రెడ్డి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇంటి పన్ను చెల్లించలేదని మున్సిపల్ సిబ్బంది ధర్నా


భీమా ఇంటి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

నేరేడుచర్ల, మార్చి 27: ఇంటి పన్ను చెల్లించడం లేదని గృహ యజమాని ఇంటి ఎదుట మున్సిపల్ అధికారులు, సిబ్బంది గురువారం ధర్నా నిర్వహించారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని మూడో వార్డులో నివసిస్తున్న బానోత్ భీమా 2015-16 సంవత్సరం నుంచి ఇంటి పన్ను చెల్లించడం లేదు. మున్సిపల్ సిబ్బంది పన్ను వసూళ్ల కోసం నిత్యం అతని ఇంటి చుట్టూ తిరుగుతున్నా నేడు, రేపు అంటూ వాయిదా వేస్తున్నాడు. రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు లేవంటూ ఏదో ఒక సాకుతో పన్ను చెల్లించకుండా జాప్యం చేస్తున్నాడు. ఇటీవల ఒత్తిడి చేయగా రూ. 3 వేలు చెల్లించాడు. ఇంకా రూ. 27,542 చెల్లించాల్సి ఉంది. 90 శాతం వడ్డీ రాయితీని ఉపయోగించుకుని మిగిలిన మొత్తం చెల్లించాలని కోరినా పట్టించుకోవడం లేదు. దీంతో విసుగు చెందిన మున్సిపల్ అధికారులు అతనికి రెడ్ నోటీస్ జారీ చేశారు. అయినప్పటికి చెల్లించకపోవడంతో చివరికి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ భీమాకు ఎన్నిసార్లు గడువు ఇచ్చినా పన్ను చెల్లించకపోవడంతో ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపల్ మేనేజర్ యాకూబ్ అలీ, వార్డు అధికారులు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద వనంలో అగ్నికి ఆహుతైన మొక్కలు

చివ్వెంల, మార్చి 27: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో సంపద వనం ఏర్పాటు చేశారు. ఈ వనంలో నాటిన మొక్కలు మంటల్లో కాలిపోవడం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బంది సంపద వనంలో ఎండిన గడ్డిని తొలగించి మంట పెట్టగా అది కాస్త విస్తరించి మొక్కలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయంపై ఎంపీడీఓ సంతోశ్‌కుమార్‌ను వివరణ కోరగా పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయని, వాటి స్థానంలో కొత్తవి నాటుతామని తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్.. ఒకరి మృతి

చింతలపాలెం, మార్చి 27: ట్రాక్టర్, ఆటో ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని గాంధీనగర్ తండాలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దొండపాడు వైపు నుంచి చింతలపాలెం వైపునకు వెళ్తున్న ఆటోను గాంధీనగర్ తండా వద్ద ఎదురుగా మిర్చి లోడుతో వచ్చిన ట్రాక్టర్ అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తాటికొండ నగేశ్ తలకు బలమైన గాయం కావడంతో 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నగేశ్ మేనల్లుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ అజ్మీర గాంధీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

'గ్రామాల్లో పారిశుధ్యాన్ని పట్టించుకోని ప్రభుత్వం'

నడిగూడెం, మార్చి 27: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ విమర్శించారు. మండల పరిధిలోని బృందావనపురం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న ఇంకుడు గుంతను సీపీఎం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలో మూగజీవాలు, చిన్నారులు పడే అవకాశం ఉందని, దానిని వెంటనే పూడ్చి వేయాలని కోరారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, ముసుకు వీరస్వామి, బొడ్డు సత్యనారాయణ, చేపల అశోక్, నర్సమ్మ, ప్రమీల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

తుంగతుర్తి, మార్చి 27: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ వెంకయ్య తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ పాఠశాలలో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలోని విద్యాలయాల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు అపరిచితులకు చెప్పొద్దని సూచించారు. మెసేజ్‌లలో వచ్చే బ్లూ లింక్‌లను అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయొద్దని కోరారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. అదేవిధంగా రోడ్డు నిబంధనలను తెలుసుకోవాలని, అతి వేగంతో వాహనాలు నడపొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమారెడ్డి, కానిస్టేబుల్ రవికుమార్, రమేశ్, సాయి, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, గోపయ్య, ఈశ్వరాచారి, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండల పరిధిలోని రాయినిగూడెం ఉన్నత పాఠశాలలో హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం -1 స్పెషల్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణపై ప్రిన్సిపాల్ రామారావు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బి.నాగార్జున, ఎస్.బాలరాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం'

సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

మఠంపల్లి, మార్చి 27: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యలక సోమయ్యగౌడ్ విమర్శించారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియాతో పాటు చల్లా జయకృష్ణ, జడ్డు సుజాత, వెంకటేశ్వర్లు, అంజయ్య, నెహ్రూ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి ఇప్పించాలని అధికారులకు యువతి విజ్ఞప్తి

నాగారం, మార్చి 27: తన మేనమామ నుంచి రావాల్సిన ఆస్తిని ఇప్పించి తనకు న్యాయం చేయాలని మండలంలోని పస్తాల గ్రామానికి చెందిన జటంగి శిరీష అధికారులను కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2007లో తన మూడేళ్ల వయసులో తండ్రి లింగస్వామి మరణించడంతో మేనమామ అయిన జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామానికి చెందిన నోముల లింగయ్య తన తల్లి శంకరమ్మను, తనను చూసుకుంటానని చెప్పి తన తండ్రికి చెందిన వ్యవసాయ భూమిని అమ్మగా వచ్చిన డబ్బులతో అడివెంలలో 4 ఎకరాల వ్యవసాయ భూమి, సూర్యాపేటలో 200 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అనంతరం తల్లి శంకరమ్మ 2010లో అనారోగ్యంతో మరణించడంతో తనను నల్లగొండలోని అనాథ ఆశ్రమంలో చేర్పించాడని, అక్కడ ఉంటూనే తాను చదువుకున్నానని, ప్రస్తుతం నర్సింగ్ కోర్సు చదువుతున్నానని శిరీష పేర్కొన్నారు. ఇటీవల తనకు రావాల్సిన 4 ఎకరాల భూమి, 200ల గజాల ఇంటి స్థలం ఇవ్వాలని మేనమామను కోరగా దుర్భాషలాడుతూ ఆస్తి ఇచ్చేది లేదని ఇంటి నుంచి వెళ్లగొట్టాడని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, కలెక్టర్ స్పందించి తనను ఆదుకోవాలని కోరారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు అన్యాయం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచు అంజిరెడ్డి

చివ్వెంల: పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

పాలకవీడు, మార్చి 27: పెండింగ్ బిల్లుల కోసం పోరాడుతున్న మాజీ సర్పంచులను అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం అన్యాయమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, గుడుగుంట్ల పాలెం మాజీ సర్పంచ్ కిష్టపాటి అంజిరెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన పలువురు మాజీ సర్పంచులను మండల కేంద్రంలో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ మాజీ సర్పంచులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇలాంటి బెదిరింపులకు భయపడమని, తమకు రావాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు భూక్యా రవినాయక్, బోయబోయిన భిక్షం, మునగాల సైదిరెడ్డి ఉన్నారు.

బిల్లులు చెల్లించకుండా అరెస్టులు ఇంకెన్నాళ్లు?

చివ్వెంల: పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకుండా మాజీ సర్పంచులను ఇంకెన్నాళ్లు ముందస్తు అరెస్టులు చేస్తారని మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు జూలకంటి సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రంతో పాటు రాజు తండా, మొగ్గయ్య గూడెం నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి చివ్వెంల స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి తాము ఎంతో కృషి చేశామని, అప్పులు చేసి మరీ ప్రజా సమస్యలు తీర్చామని చెప్పారు. అటువంటి తమను ముందస్తు అరెస్టు చేసి ఇబ్బందుకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో మాజీ సర్పంచులు ధరావత్ భద్రూ నాయక్, నాగునాయక్ ఉన్నారు.

తుంగతుర్తి: అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు యాకు నాయక్, విరోజి తదితరులు ఉన్నారు.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్, మార్చి 27: పేదల ఆకలి తీర్చేందుకే ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసిందని, హుజూర్‌నగర్‌లో సీఎం చేతులమీదుగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 30న హుజూర్‌నగర్‌లో సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం రాజీవ్ ప్రాంగణంలో సీఎం సభ ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తాసీల్దార్లు నాగార్జునరెడ్డి, మంగ, కవిత పాల్గొన్నారు.

నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా

రంజాన్ తోఫా అందజేస్తున్న పటేల్ రమేశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మార్చి 27: సూర్యాపేట పట్టణంలోని 36వ వార్డులో యువజన కాంగ్రెస్ నాయకుడు ఫారూక్ ఆధ్వర్యంలో 120 నిరుపేద ముస్లిం కుటుంబాలకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి గురువారం రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, షఫీఉల్లా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'జాజిరెడ్డిగూడెంలో సమస్యలను పరిష్కరించాలి'

అర్వపల్లి, మార్చి 27: మండలంలోని జాజిరెడ్డిగూడెం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ గోపికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్పంచు పాలన పూర్తయినప్పటి నుంచి గ్రామంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. కోతుల బెడదను పరిష్కరించాలని, అంగన్‌వాడీ కేంద్రానికి, గ్రామ పంచాయతీకి నూతన భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, పోలేబోయిన లింగయ్య, బయన్న పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలి'

గరిడేపల్లి, మార్చి 27: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతనం చెల్లించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కీతవారిగూడెం, గరిడేపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయిస్తూ కనీస వేతనం కూడా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి వేతనాలు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, ప్రతాని సైదులు, ఏఐటీయూసీ నాయకులు అంబటి వెంకటరెడ్డి, మాతంగి వెంకన్న, దైదా ప్రసాద్, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. 8 మంది అరెస్టు

సూర్యాపేట టౌన్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ-1లో బాబురావు అనే వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతుండగా సూర్యాపేట పట్టణ, సీసీఎస్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించినట్లు పట్టణ సీఐ వీర రాఘవులు ఒక ప్రకటనలో తెలిపారు. 8 మందిని అరెస్టు చేసి రూ.25 వేల నగదు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో పేకాట స్థావరం నిర్వాహకుడు, సూర్యాపేటకు చెందిన బాబురావు, మునగాల మండలానికి చెందిన వెంకటరెడ్డి, సూర్యాపేట పట్టణానికి చెందిన ఖాజా, ఆత్మకూర్.ఎస్ మండలానికి చెందిన ఏడుకొండలు, ఖమ్మం జిల్లాకు చెందిన గోపి, రామారావు, కిరణ్, నాగేశ్వర్ రావు అనే వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు.

సన్నబియ్యం పంపిణీపై డీలర్లతో సమావేశం

రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తాసీల్దార్ శ్రీకాంత్

మోతె, మార్చి 27: రేషన్ దుకాణాల్లో ఏప్రిల్ 1వ తేదీన సన్న బియ్యం పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించాలని తాసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో సన్న బియ్యం పంపిణీపై రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ లావణ్య, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు విక్రమ్, వివిధ గ్రామాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

'పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరుపాలి'

నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు

సూర్యాపేట టౌన్, మార్చి 27: ఏపీలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరుపాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మీసాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై పలు అనుమానాలున్నాయని, ప్రభుత్వం విచారణ జరపడంలో కాలయాపన చేయడం తగదన్నారు. ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద పాస్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ఏపీలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవీణ్ హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఎవరి ఆనందం కోసం ప్రభుత్వం క్రైస్తవుల హత్యలను ప్రోత్సహిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ నాయకులు పి.పూర్ణ శశికాంత్, పూజార్ల సామేల్ కిరణ్, దరావత్ లాజర్‌నాయక్, వై.వి.రమేశ్‌బాబు, జె.అనిల్‌కుమార్, జలగం పీటర్‌బాబు, పేరాల రాజరత్నం, జి.సోలోమోనురాజు, సామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోదాడలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

గరిడేపల్లి, మార్చి 27: కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేశ్ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు క్యాంపు నిర్వహిస్తారని, గరిడేపల్లి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శరీరంలో వాపు, పులిపిర్లు, గొంతు బొంగురు పోవడం, రొమ్ము ప్రదేశంలో కురుపు, రుతుక్రమంలో ఆకస్మిక మార్పులు తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

రాములోరి కల్యాణ తలంబ్రాల బుకింగ్ ప్రారంభం

పాలకవీడు, మార్చి 27: భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నామని ఆర్టీసీ లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారులు శ్యాంకుమార్, రాజశేఖర్ తెలిపారు. మండల పరిధి భవానీపురంలోని దక్కన్ ఫ్యాక్టరీలో స్థానిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నవీన ఆధ్వర్యంలో గురువారం తలంబ్రాల బుకింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు తలంబ్రాలను లాజిస్టిక్ సర్వీస్ ద్వారా అందజేస్తున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దక్కన్ సీజీఎం నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు'

చివ్వెంల, మార్చి 27: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహేశ్వర్ హెచ్చరించారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ గ్రామ శివారులో బహిరంగంగా మద్యం తాగుతున్న పలువురిని గురువారం సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగంగా మద్యం తాగితే జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

సూర్యాపేట టౌన్, మార్చి 27: ఉత్తమ ప్రతిభను కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించడంలో జిల్లా కేంద్రంలోని మహర్షి కళాశాల ముందుంటుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ పల్లె నగేశ్, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, కరస్పాండెంట్ నారాయణ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. ఇటీవల వెలువడిన మహాత్మా గాంధీ యూనివర్సిటీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన మహర్షి కళాశాల విద్యార్థిని యాకమ్మకు గురువారం రూ.10 వేల ప్రోత్సాహకం అందజేసి అభినందించారు. యూనివర్సిటీ స్థాయిలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జ్ఞానసుందర్

తుంగతుర్తి, మార్చి 27: తుంగతుర్తిలోని కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఒంగోలు నాగరాజు ఆధ్వర్యంలో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా అన్నెపర్తి జ్ఞానసుందర్, ఉపాధ్యక్షుడిగా కారింగుల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా ఎండీ.పర్వీన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా రాజారాం, ఈసీ మెంబర్‌గా ప్రతాప్, కోశాధికారిగా సతీశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

- జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ పీడీ అప్పారావు

మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ పీడీ అప్పారావు

పాలకవీడు, మార్చి 27: వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ పీడీ అప్పారావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో కూలీలకు నిర్ణీత పని కల్పించాలని, ఎండల తీవ్రత కారణంగా రక్షణ చర్యలు చేపట్టాలని, పనులను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మి, అదనపు ప్రోగ్రాం అధికారి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం'

సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త సునీత

సూర్యాపేట, మార్చి 27: తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సునీత అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నేషనల్ బీ బోర్డు ఆధ్వర్యంలో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై గురువారం జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పొడవున వాతావరణ పరిస్థితుల ఎలా ఉన్నా తేనెటీగలను పెంచొచ్చని తెలిపారు. స్థానికంగా తక్కువ ధరకు స్వచ్ఛమైన, నాణ్యమైన తేనె లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం తేనె వినియోగం బాగా పెరిగిన నేపథ్యంలో డిమాండ్‌కు సరిపడా తేనె దొరకడం లేదని, మార్కెట్‌లో నకిలీ తేనె అంటగడుతున్నారని చెప్పారు. కాబట్టి రైతులు తేనెటీగల పెంపకాన్ని ఎంచుకుంటే ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వివరించారు. సదస్సులో శాస్త్రవేత్త డాక్టర్ రజనీకాంత్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, ఉద్యానవన అధికారి నాగయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మఠంపల్లి, మార్చి 27: మండలంలో వ్యవసాయ కళాశాల నిర్మాణం కోసం రఘునాథపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో వ్యవసాయ , రెవెన్యూ శాఖల అధికారులు గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలోని 247 సర్వే నంబర్‌లో సుమారు 80 ఎకరాల పైగా ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ భూమి వ్యవసాయ కళాశాలకు అనుకూలమైనదిగా గుర్తించి నివేదకను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, తాసీల్దార్ మంగా రాథోడ్, వ్యవసాయ శాఖ ఏడీ రవినాయక్, ఏఓ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరి, జాని, సర్వేయర్ సమీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో రాష్ట్రస్థాయి క్రీడల నిర్వహణ అభినందనీయం

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ, మార్చి 27: విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో కోదాడలో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి క్రీడా, సాహిత్య, సాంస్కృతిక వేడుకలు నిర్వహించడం అభినందనీయమని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో గెలుపొందిన జిల్లాకు చెందిన విజేతలకు, పీఈటీలకు, పోటీల నిర్వహణ కన్వీనర్లకు గురువారం కోదాడలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంతో కాలం సేవలందించి పదవీ విరమణ అనంతరం విశ్రాంతి తీసుకోకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రావెళ్ల సీతారామయ్య, వేనేపల్లి శ్రీనివాసరావు, కృష్ణయ్య, సుబ్బయ్య, ఎర్నేని రంగారావు, సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, సోమయ్య, రఘు వరప్రసాద్, శోభ, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీపీఐ పోరాటం

- ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు, మార్చి 27: సీపీఐ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చిలుకూరులోని సీపీఐ భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 1న మండలంలోని నారాయణపురం గ్రామశాఖ మహాసభతో పాటు జిల్లా శాఖ మహాసభలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామశాఖ మహాసభలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు సాహెబ్‌అలీ, కె.వెంకటయ్య, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి, మార్చి 27: మండల పరిధిలోని వెలిశాల గ్రామంలో ఉన్న శ్రీసాయి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట్‌నారాయణ, ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు అబ్బాస్, సుజాత, స్వప్న, శోభ ,జ్యోతి పాల్గొన్నారు.

పాఠశాలలో ముందస్తు ఉగాది సంబురాలు

సంప్రదాయ దుస్తుల్లో ఉపాధ్యాయులు

తిరుమలగిరి, మార్చి 27: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు ఉగాది పండుగ సంబురాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు హాజరై పంచాంగ శ్రవణం చేసి ఉగాది పచ్చడి సేవించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కవి సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు తెలుగు నెలల పేర్లు, తెలుగు పద్యాలు, కవితలు ఆలపించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ మాట్లాడుతూ మన ఆచార, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కవి ఆలేటి శంకర్, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, జిల్లేపల్లి జానయ్య, యాదగిరి, శ్రీనివాసాచారి, జిల్లా జానయ్య, అశోక్, ఉపేంద్ర, అంజయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.